క్లుప్తంగా

101 కొబ్బరి కాయలతో సత్యమ్మకు పూజలు


అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సత్యమ్మ తల్లికి భక్తులు భక్తిప్రపత్తులతో అభిషేకం చేయించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గంధం, సుగంధ పరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేయించారు. శాస్త్రోక్తంగా అమ్మవారికి భక్తులు 101 కొబ్బరి కాయలు కొట్టి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ధూప, దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుడిపాల ఎంపీడీఓగా శివరాజన్



గుడిపాల: ఎంపీడీఓగా శివరాజన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. యాదమరి ఎంపీడీఓగా పనిచేస్తున్న ఈయన గుడిపాలకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు.

కాణిపాకంలో శాప్ చైర్మన్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం రాష్ట్ర క్రీడాప్రాథమిక సంస్థ (శాప్)చైర్మన్ అనిమిని రవి నాయుడు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ఘనస్వాగతం పలికి స్వామిదర్శనం కల్పించారు. అనంతరం స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వినతులు పరిష్కరించండి


వినతులు తీసుకుంటున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్‌నాయక్, మున్సిపల్ ఇంజినీరు వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వన భోజన సందడి


మల్లప్పకొండపై బండలపై భోజనం తింటున్న భక్తులు

గుడుపల్లె: మండలంలోని బెగ్గిలిపల్లె గ్రామ సమీపంలోని మల్లప్పకొండపై ఉన్న బసవ మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులు వనభోజన కార్యక్రమంతో సందడి చేశారు. ఆలయం చుట్టు పక్కల ఉన్న బెగ్గిలిపల్లె, నల్లగాంపల్లె, గోకర్లపల్లె, బండకొత్తూరు తదితర గ్రామాల భక్తులు తొలుత మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఉన్న రాతి బండలపై అన్న ప్రసాదాలను వడ్డించి సామూహికంగా భోజనం చేయడం, ఆ తర్వాత పక్కే కొలనులోని నీటిని తాగడం ఆనవాయితీ. కొన్నేళ్లుగా ఆకులు, తట్టలు లేకుండా బండపైనే భోజనం చేయడం ఒక సంప్రదాయంగా పాటిస్తున్నారు. ఇలా చేస్తే వర్షం కురుస్తుందని వారి నమ్మకం.

రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ దీక్ష

పెద్దపంజాణి: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. జిల్లా నాయకులు డీవీ మునిరత్నం, పార్థసారథి మాట్లాడారు. బెరపల్లెకు చెందిన చాకలి క్రిష్ణప్ప భూమికి హద్దులు చూపాలని ప్రభుత్వానికి చలానా కట్టి సంవత్సరం నుంచి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా, అలాగే అప్పినపల్లెకు చెందిన దళిత మహిళ సాలమ్మ భూ సమస్య పరిష్కరించాలని 4 నెలలుగా ప్రదక్షిణలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో శీనప్ప, నాగార్జున, సాంబశివ, సుజాత, వెంకటేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు.. అందని సేవలు



పాలకల-2 సచివాలయం

- కూటమి ప్రభుత్వం రాగానే సచివాలయాలు నిర్వీర్యం
- ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయాలు
- కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- తెరుచుకోని వెబ్‌సైట్‌లు
- పట్టించుకోని ప్రభుత్వం

పూతలపట్టు నియోజకవర్గంలో గ్రామ సచివాలయాలు

మండలం		గ్రామ సచివాలయాలు
ఐరాల	:	19
పూతలపట్టు	:	17
యాదమరి	:	18
తవణంపల్లె	:	17
బంగారుపాళెం	:	27

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నెరవేర్చింది. పల్లెల్లోనే ప్రజలకు సత్వరమే సమస్యలు పరిష్కారం అయ్యేలా ఏర్పాటైన సచివాలయాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు 545 సేవలు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల్లో సేవలు నిర్వీర్యమయ్యాయి. ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రభుత్వ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

ఐరాల: సచివాలయాల్లో సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఉద్యోగులు పని లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలాల్లో రెండు వేలు జనాభా ఉన్న గ్రామాల్లో రూ.40 లక్షలు వ్యయం చేసి నూతన సచివాలయాల్లో నిర్మించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడంతో లబ్ధిదారులతో సచివాలయాల్లో సందడి కనిపించేది. పూతలపట్టు నియోజకవర్గంలో ఐరాల, బంగారుపాళెం, తవణంపల్లె, యాదమరి, పూతలపట్టు మండలాల్లో 98 గ్రామ సచివాలయాల్లో ఉండగా 900 మందికి పైగానే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

అవహేళన చేసిన వారితోనే పింఛన్లు పంపిణీ..

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు సచివాలయ వ్యవస్థపై అడ్డగోలుగా విమర్శలు చేశారు. సచివాలయాలు ఎందుకు? అవి అసలు ఉద్యోగాలే కాదంటూ అవహేళన చేశారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. గతంలో ఒకటో తేదీనే వలంటీర్లు అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు సూర్యోదయం కాకముందే ఇంటి వద్దే ఠంఛన్‌గా పింఛన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ ఉద్యోగులతో ఒకటో తేదీనే 95 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పడం వెనుక సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకం అనేది జగమెరిగిన సత్యం. సచివాలయాల్లో సేవలను కూటమి ప్రభుత్వం పూర్తిగా కుదించింది. వంద రోజులు పాలన పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరిట గ్రామాల్లో వారం రోజుల పాటు సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించే పని అప్పగించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రభుత్వ శాఖలపై క్షేత్రస్థాయిలో ప్రజల స్థితిగతులపై అవగాహన కలిగి సచివాలయ ఉద్యోగులను ఎలా వినియోగించుకోవాలనే ప్రభుత్వానికి అవగాహన లేకుండా పోయింది. దీంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క పింఛన్, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఎలాంటి సేవలు అందకపోవడంతో వెలవెలబోతున్నాయి.

అర్జీలపై అలసత్వం వద్దు


సమస్యను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు


బోయకొండ బాధితులకు న్యాయం చేయాలని ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

- కలెక్టరేట్‌కు పోటెత్తిన ఫిర్యాదుదారులు
- సమస్యలు పరిష్కారించాలని కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌లో అధికారులకు అర్జీలు అందజేశారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. వచ్చిన వినతుల్లో ప్రధానమైనవి.

భూ సమస్య పరిష్కరించాలి..

జిల్లాలోని రొంపిచెర్ల మండలం గాజులపల్లి దళితవాడకు చెందిన దళిత గుండ్లూరి శ్రీనివాసులు సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రొంపిచెర్ల మండలం గాజులపల్లె గ్రామం దళిత ఎర్రయ్యకు 1929 సంవత్సరంలో సర్వే నంబర్ 1146/2లో 2.35 ఎకరాల భూమికి పట్టా మంజూరు చేశారన్నారు. గుండ్లూరి ఎర్రయ్య మరణానంతరం ఆయన మనవడైన గుండ్లూరి శ్రీనివాసులుకు అప్పటి రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారని తెలిపారు. భూమికి సంబంధించి 1బి అడంగల్, పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్, ఆన్‌లైన్‌లో అన్ని రికార్డులు పక్కాగా ఉన్నప్పటికీ అతని పొలంలో వ్యవసాయం చేసుకోవడానికి గాజులపల్లిలోని కొంతమంది అడ్డు పడుతున్నారని తెలిపారు. ఈ విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని చెప్పారు. దళిత శ్రీనివాసులుకు హక్కు ఉన్న భూమిలో వ్యవసాయం చేసుకోవడానికి హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకుని ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మణి, గోపీనాథ్, దాసరి చంద్ర పాల్గొన్నారు.

గాజాలో దాడులు ఆపాలి

గాజాపై ఇజ్రాయెల్ ఆటవిక దాడులు తక్షణమే ఆపాలని సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట సంఘీభావం ప్రకటించారు. ఆ రెండు పార్టీల జిల్లా కార్యదర్శులు వాడ గంగరాజు, నాగరాజు మాట్లాడుతూ కాల్పుల విరమణ జరిపి ఘర్షణలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్ హమాస్ దాడికి ప్రతీకార దాడి పేరుతో ఇజ్రాయెల్ పాలస్తీనాపై విచక్షణారహితంగా క్రూరమైన దాడులకు దిగడం బాధాకరమన్నారు. ఈ దాడిలో 42 వేల మందికి పైగా పాలస్తీనా వాసులు మృతి చెందారని చెప్పారు. సీపీఎం జిల్లా నాయకులు ఓబుల్‌రాజు, నాయకులు ఎల్లప్ప, రమణ, సీపీఐ నాయకులు మణి, గోపీనాథ్ పాల్గొన్నారు.

బోయకొండ బాధితులు ఆదుకోవాలి..

బాధితులను ఆదుకోవాలని బోయకొండ గంగమ్మ దేవస్థానం బాధితులు కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త నాయకులు కోరారు. డిమాండ్ల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు మాట్లాడుతూ బోయకొండ ఆలయ అభివృద్ధి పేరుతో అన్యాయం జరిగిన చిరు వ్యాపారులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోయకొండ భక్తులకు అనేక రకాల సేవలు అందిస్తున్న చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పీఎఫ్ సమస్యను పరిష్కరించాలి


సీఈఓను కలిసిన ఎస్టీయూ తిరుపతి నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో ఉద్యోగ, ఉపాధ్యాయ పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని తిరుపతి జిల్లా ఎస్టీయూ నాయకులు తెలిపారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ రవికుమార్‌నాయుడును కలిసి మాట్లాడారు. పెండింగ్ షెడ్యూళ్లను మండలాల నుంచి తెప్పించుకున్నామని సీఈఓ చెప్పారు. వాటిని పరిశీలించి వ్యక్తిగత ఖాతాలకు జమ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని మండలాల నుంచి షెడ్యూల్స్ రావాల్సి ఉందని వాటిని పంపడానికి సంబంధిత డీడీఓలు చొరవ చూపాలన్నారు. వ్యక్తిగత పీఎఫ్ ఖాతాలను క్రమబద్ధీకరించడానికి మూడునెలల సమయం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాగేశ్వరరావు, ధనుంజయనాయుడు, జగన్నాథం, వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాలు ముఖ్యం


విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్: డిగ్రీ విద్యార్థులకు నైపుణ్యాలు ముఖ్యమని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీధర్ అన్నారు. సోమవారం ఆ కళాశాల ప్రాంగణంలో యునెక్స్ శిక్షణా కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ తమ కళాశాలలో గత నెల రోజులుగా బెంగళూరు యునెక్స్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ లీలాకుమారి, ప్రిన్సిపల్ సోమశేఖర్, చేంజ్ మేకర్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

చిత్తూరు అర్బన్: సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నెట్టికంటయ్య వివరాల మేరకు.. సారా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో తేనెబండ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. అక్కడ ఆటోలో రూ.15 వేలు విలువ చేసే సారా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సారా తరలించేందుకు వినియోగించిన ఆటోతో పాటు తేనెబండకు చెందిన రాజేష్ (38), సంతపేటకు చెందిన కుట్టి(27)పై కేసు నమోదు చేశారు. సారా సరఫరా చేసిన ఎడ్విన్ రాజేష్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ తెలిపారు.

ఆరోగ్య సంరక్షణ అవసరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ప్రస్తుతం వాతావరణంలో తలెత్తిన కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సంరక్షణ అవసరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 75 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ దోమల కారణంగా ప్రాణాంతక మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటి వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. దోమలను నివారించుకోవడం ద్వారానే వ్యాధులను దూరం చేయవచ్చని చెప్పారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా, శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోండి


మల్లకుంటలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగడం వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. సోమవారం మండలంలోని పుణ్యసముద్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక 40 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో ప్రత్యేక పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లకుంటలో ఫ్యామిలీ డాక్టర్..

మల్లకుంటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి వినయ్‌కుమార్ రోగులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు. దోమకాటుకు గురికాకుండా వేపాకు పొగ, దోమతెరలు వాడాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే వైద్యం

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చులేకుండా, సమయం వృథా కాకుండా ఇంటి వద్దే వైద్యసేవలు అందుతున్నాయని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత అన్నారు. మండలంలోని తిమ్మాపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 50 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపైన ఉన్న రోగులకు వైద్యసేవలు అందించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు..

పంచలోహ ఆభరణాల వితరణ


పంచలోహ ఆభరణాలను అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధం ఆలయమైన శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఓ దాత పంచలోహ ఆభరణాలను విరాళంగా అందజేశారు. కాణిపాకానికి చెందిన మధుసూదన్‌నాయుడు రూ.2.40 లక్షల విలువ చేసే పంచలోహ నాగాభరణం, ముఖ కవచాన్ని ఆలయ ఏఈఓ రవీంద్ర బాబుకు అందజేశారు.


దివ్య స్వరూపిణి.. కరుణించు తల్లీ..!





భగవతిమాతగా అంకాళపరమేశ్వరి, మహచండీ అలంకరణలో అమ్మవారు, గుడిపాల: కాత్యాయణీ దేవి అలంకరణలో, బంగారుపాళెం: శ్రీమహాచండీదేవిగా..





కాత్యాయని దేవిగా దుర్గాంబ, బంగారుపాళెం: అన్నపూర్ణదేవిగా ముత్యాలమ్మ, సరస్వతిదేవిగా పాలేటమ్మ, లలితా త్రిపురసుందరిదేవిగా చాముండేశ్వరి

కాణిపాకం: చిత్తూరు నగరంలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో సోమవారం నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. సాయంత్రం కాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అంకాళ పరమేశ్వరి ఆలయంలో వెన్నె అలంకరణ, భగవతిమాత అలంకరణ, షిరిడిసాయి బాబా ఆలయంలో మహచండీ అలంకరణ, కోదండరామస్వామి ఆలయంలో నరసింహావతార అలంకరణలో అమ్మవారు భక్తులను కటాక్షించారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు కాత్యాయణీదేవిగా, పల్లూరు గంగమ్మ అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మహాచండీదేవిగా వజ్రాలపురం గంగమ్మ

బంగారుపాళెం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు సోమవారం మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శ్రీమహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బోయకొండ గంగమ్మను అన్నపూర్ణదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు వచ్చారు. బొమ్మాయిపల్లెకు చెందిన పట్టాభి, మునస్వామి, నారాయణస్వామి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, మేనేజరు మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవిగా ముత్యాలమ్మ..

బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ శుక్రవారం అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఆలయం వారిచే భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామానికి చెందిన నిర్మల రాజేంద్రప్రసాద్ కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

వెంకటగిరి గంగమ్మకు ప్రత్యేక పూజలు..

మండలంలోని మొగిలివెంకటగిరి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ అర్చకుడు జగదీశ్వరస్వామి అమ్మవారి మూల విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా మండలంలోని ఓంశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

సరస్వతిదేవిగా పాలేటమ్మ

ఐరాల: గ్రామ దేవత పాలేటమ్మ సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. అలాగే వైఎస్ గేటులోని చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవిగా భక్తులకు కటాక్షించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ పట్టాలు పొందిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ డా.సుదర్శనరావు అన్నారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో మొట్టమొదటిసారిగా సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ డా.సుదర్శనరావు మాట్లాడుతూ మంచి ఇంజినీరు కావాలంటే నైపుణ్యాభివృద్ధి ముఖ్యమన్నారు. సృజనాత్మకత, తార్కికం, నాయకత్వం, కమ్యూనికేషన్, నైపుణ్యాలు ఉన్న విద్యార్థి మంచి ఇంజినీరు అవుతాడని తెలిపారు. సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ ట్రస్ట్ నిర్వాహకురాలు డా.డీకే కల్పజ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యనభ్యసించిన వేలాదిమంది విద్యార్థులు విదేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. అనంతరం మొత్తం 11 బంగారు పతకాలను, నగదు బహుమతులను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటాచలపతి, సెక్రెటరీ డీకే బద్రినారాయణ, ఆర్‌కే కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌బాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాన్యం భూములను సర్వే చేయండి

- ఆక్రమణ స్థలాలను పరిశీలించిన దేవదాయశాఖ ఏసీ చిట్టెమ్మ
- వారంలో నివేదిక ఇవ్వాలని ఈఓకు ఆదేశం


భూములను పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఏసీ

చౌడేపల్లె: మండల కేంద్రంలో గోసలకురప్పల్లె సమీపంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం మాన్యం భూములను సర్వే చేసి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని దేవదాయశాఖ ఏసీ చిట్టెమ్మ ఈఓ కమలాకర్‌ను ఆదేశించారు. సోమవారం ఆమె కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూముల్లో ఆక్రమణదారులతో మాట్లాడారు. కొన్నేళ్లుగా 39 మందికి సంబంధించి ట్రిబ్యునల్ కోర్టులో కేసు నడుస్తోందని ఈఓ కమలాకర్ ఏసీకి వివరించారు. మరి కొందరు ఆక్రమించారని, వాటిని తాత్కాలికంగా తొలగించినట్లు తెలిపారు. బస్టాండులోని మాన్యం భూముల్లో నిర్మించిన షాపులు, భవనాలను సర్వే చేయాలని ఆమె ఈఓను ఆదేశించారు. మాన్యం భూముల్లో ఏకంగా భవనాలు నిర్మిస్తున్నారని, సేద్యం చేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. అలాగే శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ నిర్వహించాలని గ్రామస్తులు ఏసీని కోరారు. ఆక్రమణదారుల నుంచి మాన్యం భూములను స్వాధీనం చేసుకోవడంతోపాటు షాపులు, భవనాల నుంచి అద్దె వసూలుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. అనంతరం మృత్యుంజయేశ్వరస్వామిని దర్శించుకున్నారు.